# ఇగురం

నవల



భూతం ముత్యాలు

# భూతం ముత్యాలు

# ఇగురం

# IGURAM

Published : 2012, Copies : 1000

*For Copies :*

**BUTHAM MUTHYALU**
H.No. 4-11-117/1, Chaithanya Nagar,
D.V.K. Road, (Near LHC),
NALGONDA - 508 001.
Cell : 9490437978, 9959546780

Available in all leading book shops

DTP : Raj Graphics, Nalgonda. 9705347801

Printers :

price : 60/-

# 1

బస్సు రైయిన ముంద్కుర్కుతుంది. మతిని తొల్సినయాది ఎన్కకు ఉర్కుతుంది. బద్రంరా అని చెప్పిన వాళ్లు అక్కడే ఉన్నరు. నేనుమట్కు సాన దినాలకు ఊరి బాట పట్న. అప్పుడు ఊరు ఎట్లుండే మరి, ఇప్పుడు ఎట్లుందో మరి నా ఎంకటిలచ్చి, సోపతికాండ్లు, అమ్మయ్య అందరూ ఎట్లుంద్రో. నా పుల్లావు బట్టపెయ్యలు ఉన్నయో లేవో. అమ్మయ్యకైతే కొత్తచీర, కమీజు, దోతి తీస్కుంటి గని ఎట్లుంద్రో.. మతి తొలుస్తుంది. యాదుల్ని నెమరేస్తున్నా. బస్సురైయిన ఉర్కుతనే ఉంది. కొండ జాలు పార్కుంట, పార్కుంట పద్మటి పక్కెంట సెర్వుల గల్సి పార్కుంట, వొయిదోని వొంపును కల్పుకొని సశలేటి వాగై, కిష్టమ్మ ఎద్మకాల్వదాటి కిష్టమ్మ నదిల కల్సుతుంది. కొన్ని ఆమడలు మైళ్లు పార్కుంట. గుట్ట ఆరన లొద్ది, ఇర్కులొద్ది, ఇక్కిర్కు లొద్దిల నెర్రిచ్చిన పాయల సుక్క సుక్క జార్కుంట తేట దొనై, పాలువన్నెతో పాలదోనై, సల్లసల్లని నీళ్లతో సలిదోనై పార్తుంది వాగు. వాగుల ఇస్క తెలతెల్లగ పరం పరం జల్లిబట్న ఉస్కలెక్క తలతల మెర్సుకుంట ఉంటాది. పైనుంచి పాయ కనగంటిపాయ వాగులకల్సి, కత్వదాటి ఆల్గుదాటి, కొన కనగంటికొచ్చె సర్కి పర్లాంగు ఎల్తై పార్తుంది వాగు. పద్మటి వాగు, ఉత్తరేని ఆగులు కల్సి ఆడ ఎల్పు ఎల్తై పార్కుంట ఎన్కట్కి గట్న నైజమోని బిర్జి బీటలు వారి కుంగిందంటె ఆడ తడ ఎంత కొద్దదో సెప్తైజాలదు మరి. గుట్ట ఆరన గుట్ట సానువుల పచ్చని చెట్లు పసిరిక పాములై మెర్సుతుంటయ్. మషమ్మ గుండ్లకు వేలాడిన చెట్ల కొమ్మల మీన ఆకులమీన

సర్కెజాలు రాలి ఎండ పొడసోకి మెర్సుతుంది. గుట్ట గుట్టంటె రాములూరి గుట్ట రామసాని గుట్ట పొద్దుగూకిందంటె సలిసప్పున కమ్ముకొని దొననీళ్లు తిమ్మిరెక్కుతై. చెట్ల గల గలల గాలులు, పచ్చుల కిలకిలలు గాలికి ఊగె కొమ్మలు రెమ్మలు, ఎగిరె తుమిష్కలు పక్కెంట తంగెల్లు పిల్లబాటలు, బాటలో పసుల గిట్టలు, ఆగుర్తులు చెద్రిపోకుండ ఉండే జాడలు. ఆటి జాడెంట పోతే... ఆ సానువుల్లో ఊరు సప్పుల్లు పల్కరిస్తయ్. ఇంటి పొయ్‌ల పొగ ముసుర్కొని ఊర్ని ఇట్నె పట్టిస్తది.

ఇది కల్వర పెట్టున్న యాది, ఎన్నిమార్లో నాలోనేను కుమ్లిన, మతి కమ్లిన సంగతి. తెగ చెప్పాల్నని ఆరాట పడ్తున్న, ఎవల్కి చెప్పాల్నని మల్ల నాలోనేనే మదన పడ్తున్న ఎన్ని సార్లో గిట్ల కల్వర పాట్కు గురైన. తీరొక్క తెర్లయిన, బత్కు దెశ గిర్కెతిర్గిన. మతిల మల్లాడి మల్లాడి అల్లాడ్తున యాదుల సంగతి ఏం జెప్పను ఎట్ల జెప్పను. యానుంచి మొదల్బెట్టను ఏమో ఎర్కైత లేదు, ఎటూ తోస్తలేదు. ఎమన్న గానియి గని గా... నా... సిన్నప్పటి సంగతి నుంచి మొదల్బెట్టాల్నని మతిన తెగ ఉబలాట పడ్తుంట్ని బత్కు దిగుదు, బాయిల అనుబవాల ఊట జాలు నీటిని తోడి బత్కు రుసి సూపాల్నని, సేద బొక్కెన దీస్కొని బత్కుబాయి గిర్కలకెక్కిస్తె కాలం సగ్రున ఎన్కకు తిర్గినట్టు, కాలం గిర్కరైయిన తిర్గుతుంటె, బొక్కెన మతి బాయిలకు దిగి యాదుల నీటి ఊటను తాకింది. ఎంత సేదినా ఒడ్వని యాదుల్ని బాల్యం నుంచి, నాకు గుర్తున్న కానుంచి సేది గోలంల గుమ్మరిస్తే బత్కు బైట గోలం నిండ్గ నిండి యది అల్గుపారింది. ఒక్కొటిగ పూసగుచ్చినట్క తెగ జెప్పాలని ఆరాటం తప్ప ఇంకేం ఆశ లేదు. అబాసు పాలు కావలన జాసలేదు. ఎంగిలైన బత్కు ఎద నిండిన సొద, తెరలు తెరలుగ, పోగులు పోగులుగా, ముంగల ఇప్పుతున్నా, లోకం తీరు తెల్పుతున్నా నజర్‌ల వడ్డది నిజం.

నాకు ఇంకా గుర్తుంది. మతిన మస్కబార్నట్టు ఉంది. యాదిల కంటి సూపు కానరానట్క ఉంది. గని నిజం జాప్పాలే ఎమన్న గానియ్ గాని నిజంగా, నిజమే జెప్పాల్ననీ మతిని కెల్కిన యాదులు ఒక్కోటి బైట్కి రావాల్నని తెగ ఆరాటం. ఆటి ఆరాటం ఎక్వయింది. "నేను మా అమ్మయ్యకు ఒక్కన్నే. నాకంటె ముంద్గాత అక్క పుట్టిందట, అక్కెట్లుందో. ఇంగప్పుడు అమ్మ బాలింత. బాలింతకు శెరలు,

చెప్పనలవికాని శెరలు, గా శెరల మజ్జె మరుసటేడుకు నేను అమ్మ కడ్పుల జొరవడ్డనట అమ్మ చెప్తుండేది. అమ్మ పొట్టతోటి ఉండంగ ఓపాలి నీల్దేను పోయి బాయికాడ కాల్జారి. అండ్ల పడ్డదట. గాని అమ్మకు ఈతవస్తది మా తాత అమ్మకు నెర్పె లేకుంటే అమ్మతోపాటే నేను లోకం చూసేవాన్ని కాను. నిండు సూలాలు పొట్టతోనుంటె బాయిల వడ్తె ఎంత ఇది. ఎంత ఇబ్బంది. అయినా నూకలున్నయ్ కాబట్టి బత్కి బైటవడ్డది. ఇంగ గీలోకంల నేను కండ్లు దెర్సిన. ఔ అవ్వ జెప్తుండే, నే ఉకొట్టుకుంట ఇంటుంట్టి....

మా అమ్మోళ్లు అప్పట్ల కల్గినోల్లే. మా అమ్మకు అర్నంగ మా తాత ఓ పుల్లావు పెయ్య నిచ్చిండట. అమ్మంటే తాతకు పాణం. ఒక్కతే బిడ్డ గట్ల గార్వంగ సాద్కొని పక్కూరోడు ఇగురం తెల్వనోడు మొరటు మొద్దోడు, అని తెల్సినా మా అమ్మనిచ్చి లగ్గం జేసిండు మాతాత. అదిగాక మా అయ్యకు అప్పటికే పెండ్లయింది గని అయ్యను సూస్తాల్కి ఆమెకు భయం. మన్సి కండవట్టి భీముని లెక్క ఉంటడు గని మడ్సి సానమంచోడు. సోమరి, 'తెల్వితక్వ ఆకలెక్వ' శేరు సొజ్జల బువ్వ ఒక్కడే తింటడట. తిన్నట్టే పని సుత జేత్తడట, గని ఎందో్క అయ్యంటే ఒల్లలేదట ఆమె. ఇంగేముంది అయ్యను వోద్లి మారు మనం పోయిందట. గిదంత తెల్సినా మాతాత మా అమ్మను ఇచ్చి పెండ్లి జేసిండట. మా ఊర్ల "మేము బ్యాగరోళ్లం మా అయ్య తోడు ఆర్గురు అన్నదమ్ములు. మా అయ్యపేరు నాగులు. తెల్వితక్వ ఆకలెక్వ. ఐనా మొద్దోలె కష్టం జేసి మా పెద్దయ్యలకు పోసేటోడట. ఆళ్లు సుత ఈ కష్టాన్కి ఆశపడి ఈనెను దొరోల్ల తాన జీతం ఉంచిండ్రట. గాల్లు ఎచ్చిడికి బీమునిలెక్క ఉంటోడాయె అందే్క భీమయ్య అని పిల్సెటోళ్లు రానురాను ఆయన తెల్విని జూసి భీమయ్య కాస్త బియయ్యగా మారిపాయె. ఇగ అప్పట్నుంచి బియ్యయ్య అని పిల్వడం మొదల్బెట్టిరి. బియ్యగా అంటె బాదపడక నొచ్చుకోక పాయె, మర్మం లేని మనిషాయె, కల్లకపటం తెల్వనోడు. మా పెద్దయ్యలు ఎంతంటె అంత, ఏది జెప్తె అది, ఎద్రు పల్లెత్తు మాటనడు. గామంచి తనం జూసి మా అమ్మ లగ్గమాడింది. మాకు ఊల్య బ్యాగరి తనం ఉంది. గని అప్పట్ల ఎవలు సచ్చినా ఆర్గురు కల్సి కాష్టం బెట్టెది. కని కర్సులకు ఏమి ఇచ్చేవారు కారట, ఊరోల్లు గింత మందు సార తాపిచ్చేవారట,

గని కాలమయి పంట పండిననాడు కల్లాలల్లకు పోతే ఇంట్కి రెండు సేర్లు బిచ్చం బెట్టెటోళ్లు. ఊల్య మాదిగోళ్లు గొడ్డుగోస్తె పెండతట్ట కూర దెచ్చేది. బేగరోన్కి శేర్లెంక పాలయె మరి. ఆడ గొడ్డలి దీస్కపోయి బొక్కలు, బోటు గొట్టాలె. ఊళ్లె సావులకు మట్కు కుండల సిల్లర పైసలు పది రూపాయలు దాంక వస్తయ్ అదే పదేల రూపాయలు. ఇగ సచ్చినోని మీద కప్పిన కొత్తది తెల్లగుడ్డ మాకెనట. అది మా అయ్య అంగి గుట్టిచ్చుకునెటోడు. మా అయ్య పెండ్లి నాట్కి ఏరు పడేస్తే మా అయ్య పాలుకు రెండు అట్కెలు ఓ కొట్టె (దాన్యం పోసేది) ఓరోలు, ఓ గోళెం, ఓచేద బొక్కెన, ఇచ్చి పక్కన మిద్దెల వాళ్లు ఉండి, మాకేమో గుడిసె వేరుగ ఏసిరట, ఇప్పట్కి అదే గుడిసె మా ఊర్ల మాకు. మాకు మాన్యం ఉంది. పెర్మల బాయిల పాలు ఉంది. ఆ మాన్యాలు పెర్మల బాయి ఊరి కర్ణం దొర ఇనాంగ ఎన్కట్కి ఇచ్చింంద్రట. బేగరోళ్లని దాన్కింద మోటగొట్టి బుడ్వోడ్లు పండిస్తే ఆ తౌడు బుక్కిన యాది నాకు గుర్తుంది. అయ్య వీపున ఎక్కి పెరుమళ్ళబాయిల తాన మాడిన సంగతి నాకు ఇంకా గుర్తుంది. నేను పసిపోరన్ని ఒక్కనే గార్వంగ సూస్కునేటోళ్లు. అక్కను సగ మంచిగనే సూస్తరన్కో.

ఊరుకు కర్వొచ్చింది. ఊరెంది దేశమే కర్వుల వడ్డది. అయ్య అమ్మ నన్ను తీస్కొని కాల్వ కింద్కి వలస వచ్చినం. ఆడనే ఉండి ఏదో పన్కి అమ్మయ్య పోయ్యేది. నన్ను మట్కు ఆన్నె బడిల ఒకటో తరగతిల జేర్పిచ్చిండు. నాకు మైవెల్లి సారు మొదట అఆలు దిద్దిచ్చిండు. ఆడ ఓ రెండేండ్లు గడ్సింది మళ్లి ఊరికి వొస్తిమి. మా ఊరి మాల్పటేలుకు మెల్తామైతే ఆయన గాయిన తోట్లకు జీతం తీస్కపోయిండు మావోళ్లని. ఆడ అయ్య తోటపని, అమ్మేమో ఆళ్ల ఇంట్ల పన్కి కుంద్రింది. నన్నుమట్కు ఊల్యసగ బడికి తోలసాగింద్రు. అయ్య పనికి పోయి వొచ్చేటప్పుడు తోటల పండ్లు దెచ్చేది. నేనేమో మాపు పండ్కునేది గని ప్రేమతోని లేరా అయ్య లే అని నిద్రలేపి నిద్రలనే బత్తాయి పండ్లు అరటి పండ్లు తిన్పించేది. పొద్దున లేవంగనే పావల ఇచ్చి బడికి పంపేది. అక్కకంటె ఎక్వ నన్నే మంచిగ జరంత గార్వంతోని సూస్కునేది.

అయ్య ఒకపాలి ఊరెల్లిండు గూడెంకు ఆడ మా అయ్యను జూసి మావోళ్లు, మాపాలోల్లు, ఊరోళ్లు అందరూ ఆశిర్కపోయి 'ఎర బియగా' జబర్దస్తుగయినవ్

ఎడున్నవ్‌రా". "దొరతాన జీతం ఉన్నరోయ్" "అట్లనా అయితే మమ్ముల గూడ తీస్కపోరాదు". "నా ఒక్కనికే జీతంరా నేను నా భార్య ఇద్దరం ఆళ్లతాననే ఉండాలే అట్ల కర్రారైతిమి ఇక మిమ్ముల్ని యాడ తీస్కపోను. సరెతియ్‌రా నువ్వన్న మంచిగున్నవ్ సాల్ పా" అనిరి ఇగ ఉల్య మట్కు అమ్మకు అర్థమిచ్చిన ఆవును, దాని దూడను కర్వుకాలంల మాపెద్దయ్య అమ్ముకుండు. శెల్క గింత ఐదొందలకు ఎక్రానికి అమ్ముకుండ్రు. మా అయ్య అడ్గితే, మా అయ్యకు ఉత్తచేతులు జూపిచ్చిండ్రు. మాన్యం ఆల్లే చేస్కొవట్టిండ్రు పెర్మల బాయి పాలు వాళ్లపాలే అయింది. బేగరితనం వాళ్లె చేస్కొవట్టిండు. ఆ బేగరితనంల వొర్గిందేం లేదూ. ఆయాల్ల ఏముంది ఇంట్కి రెండు సేర్లు పండ్గల నాడు పాశన్నం రెండు బూరెలు జోలెల ఏసేది. అయిదెచ్చి ఊల్య పెదదొర బచ్చాలు ఇవి, కొంటోళ్ల సేటమ్మ పులగం గిది, పటేలు తుంకల కూర గిది అని ముర్సుకుంట తినేది, తప్ప కడ్పునిండేది కాదూ. మాదిగోళ్లు చెప్పులు జేసి, బత్కుతుండ్రు గని మాలోన్కి ఏముంది, బ్యాగరితనం వతన్ అంటగట్టిరి సావు పీన్గెలు, కాష్టాల గడ్డకు కావలి తప్ప ఏం వొర్గింది లేదూ. ఏం కులిర్థి బత్కింది లేదూ, సచ్చింది లేదు. పెర్మల్ల బాయి అంటే మర్సిన ఎన్కటి సంది గా బాయిల దేవుల్ల విగ్రహాలు కడిగేవారట, పెరుమాళ్లు అంటే మహా విష్ణువు అట, అందే్క ఆ బాయి పెరుమాళ్లబాయి అయింది, గని ఊర్ల మావోళ్లె మాకు ఏకు మేకయింద్రు. అయ్య వుత్తచేతులు వూప్కుంట వొచ్చిండు. అమ్మ గుల్లసాగింది. అయ్య తోటకు మల్లిండు. నేను ఆడ సద్వుకుంటనే బడిడ్సినంక మా ఊరి రాచమళ్ల సారయ్య బిడ్డె లక్ష్మి నా ఈడుదే. ఆ పిల్ల నేను ఇద్దరం మంచిగ ఆడ్కునేటోళ్లం. మాదంటకి నల్గురైద్గురు పోరలు కూడా జేరింద్రు. అందరం కల్సి ఆడ్కునేది గని నాకు లచ్చి అంటే ఇష్టం. దాంతోని ఎక్వసోపతి. ఇద్దరం బాగా దోస్తులమైనం మేం పర్గాశమాడ్కుంటోళ్లం. బడ్కి పోకుండ ఆడ్కోవాలని ఎంత వొంక బెట్నా అమ్మ బెద్రించేది. చేసేది లేక అప్పుడప్పుడు పసులకాడ్కి పోయెవాన్ని. మా పుల్లావు, బట్టపెయ్య అంటె నాకు సాన ఇష్టం గసోంటివి దొరకు సానా ఉన్నయ్. అయ్యి సూడగానే నాకు నా పుల్లావు గుర్తుకొచ్చేది". బస్సుల టకటక కండక్టర్ గంట లెక్క గొడ్తుండు. "రాజిరెడ్డిగూడెం గేటొచ్చింది" దిగాలనే... i

# 2

నాకాయి సూస్కుంట, ఇగోసారు.. మిమ్మల్నే.., ఇద్దో మీరు దిగాల్సిన ఇస్టేజి ఒచ్చింది. ఇదే సారు నువ్ దిగాల్సిన స్టాపు గిదే కదా.. ఇగో సారో మిమ్ములనే.. అని కండక్టరు బస్సు ఆపిండు. మనాదిన శాంతంగున యాదులు ఒక్కసారిగ కెల్కిట్లయ్. తల్లడ మల్లడమాయ్, ఇగనాకు తిర్గులాడి తిర్గులాడిన మతి ఓష్‌ల కొచ్చింది... మతి ఎక్కడెకకడో, నా పాతికేండ్ల యాదుల నుంచి తేరుకున్నది. “ఔన్ సారు రాజిరెడ్డి గూడెం గేటు గిదేనా” “గిదే.. గని... దబ్బున నడ్వు జల్ది దిగయ్య దిగూ.., ఎంతసేపు దిగుతవు నువ్వేమో నంగాడ్కుంట దిగుతున్నవ్ ఇంతకూ నువ్ గీడ్కెగదా...” “ఆ ఆ... గీడ్నె దిగాలే దిగుతున్న జర ఆగు సారు చిట్కాల దిగుతా..” ఒత్తుగ జనం మెస్లవశం గాక పాయె, జర ఓపిక పట్టు”. “అటిటెం జూస్తవ్‌గాని దిగు.. జప్పున” అనె కండక్టర్. దిగనైతే దిగిన గాని “నేను దిగాల్సింది గీడ్నెనా... ఇంక ముంగల్నా లేక దాటొచ్చిన్నా” మతిల తికమక ఆలోచించ్కుంట అటిటు సూస్తాల్కి ఊరి గేటు గిదేనన్నట్క పస్పుపచ్చ బోడుపై పెద్దపెద్ద అచ్చురాలతో ఊరి పేరు రాసిఉంది, గని అది గేటులా లేదు, అదో అడ్డలాగుంది. అదే చిన్నపాటి గూడెంలాగుంది. ఆడ ఓ నాల్గైదు ఇండ్లు సగ నెర్సినయ్. అది మనుపటిలా.. లేదు, గేటు ఆ నుంచి ఊరు రెండు కిలోమీటర్లుంటది గప్పట్ల నడ్సి పొయ్యేటోళ్లం గేటుతాన చిన్న బొడు, పలుగురాళ్ల గుట్ట, పక్కెంట మట్టి రోడ్డు దుమ్మురేగేది, (చిల్లకంప), కంపచెట్లు, పక్కెంట నల్లసర్ప ఏనె రాళ్ల తోపు, దారెంట కలమంద జమ్మలు, గట్రా ఉండేడ్వి. గిప్పుడు గాడో చాయ్ ఓటల్, రెండు మూడు ఆటోలు

నెర్సినయ్. ఓటల్ల నల్గురైదుగురు జనం. ఒచ్చిపోయేటోళ్ల కోసం ఆటోరిచ్చోల్లు, ఎన్కటి బర్లమందకు గిప్పుడు తారు పర్సుకొని ఉంది. ఆటోవాళ్లు అటిటు సూస్కుంట ముచ్చట బెట్కుంట గూకుండ్రు.

పక్కంట పైపులైన్లు పర్సుకోనున్నయ్, కట్లపాముల్గ ఆడాడ కాట్లు బెట్కోని భూంకి బోయ్యారం జేస్కొని ఉర్కుతున్నయ్ పట్నాన్కి. ఆగులమాసమాలె, గాడ పైపులు లీకై సుయ్న నీళ్లు ఎగజిమ్ముతున్నయ్, నీల్లు మట్కు సాగర్వాయె. పిల్లలు పెద్దలు దూపకు అస్కులాడ్కుంట ఆ పైపుకు మొగమెట్టి దూప దీర్సుకుంటుండ్రు. చేతిల బ్యాగుతోని లాగుగీగు లొట్టపీసుతోని షానిక కన్పడ్తుండు జానయ్య. జానయ్య వాళ్ల కాయి చిత్రంగా చూడసాగిండు ఆడ అతని ఎవరూ గుర్తించలే.

జానయ్యను "ఊర్లకు పోవాల్నాఎంది" అడ్గె ఓ ఆటోగాయిన

"ఔను.." సారు

"రాకూకో ఆటోరిచ్చనిండంగనే పోదాం"..

"ఎంతమంది గావల్నెంది" నీకు తెల్వందేముంది.

ఓ పది పన్నెండు మందైతనే మా పొట్టగిట్టేది. అప్పడ్దాంక ఆగాల్సిందే" "ఇంకోటి పోదా ఎందీ", "గీడ సీరియల్ ఉంటది ముందు బండి నాదే దీని తర్వాతనే ఇంకోల్లది'. ఇక్కడ ఈ ఊర్కి కొత్తనా ఏంది?, "ఆ...", ఎవలింట్కి పోవాలే" "అది... అది...", "ఎవరైతే మాకెందుక్కు గాని జరగూకో...", అనె "ఊరుగేటే గిట్ట మారిపోతే ఊరెంత మారిందో అపట్లా అడ్వని తలపించేది ఊరు. మరిగిప్పుడు" అన్కుంట మతి యాదుల్ల పడ్డడు జానయ్య. బేంచి మీద పేపరు సూస్కుంట నాల్గురు కుర్రాళ్లు... పర్గాష్కాలాడ్కుంటుండ్రు. సుట్టూత సండ్ర తుమ్మలు, కామంచ గాంటలు, దుబ్బల్ల ఈదులొంపు, మంగలోని ఒర్రెల తాళ్లవనం, మచ్చుకు కానరావటం లేదు. దూపదీర్సె మక్తబాయి జాడేలేదు. "ఎందిది ఎందిట్ల గిప్పుడు అటుఇటు నాల్దిక్కుల సూస్తె గేటు చౌరస్త లెక్కంది. నాగ్రోకుల్ల రాల్లు పాతి ఎర్రపిడ్స శెల్కన తోటలు నెర్సినయ్, పక్కంట తోట్లకు కాపల అన్నట్టు చిల్లకంప ఏన్గులు, ఇంకోరోకు సూపు ఆనెదాంక కడీలు పాత్కొని సుట్టు ఇన్ప తీగలల్లుకొని కన్పడ్తున్నయ్, పల్గురాళ్ల కొండలు కర్గి బోడగుండ్లై కన్పడ్తున్నయ్. శెల్కల్ల చేలు పైరగాలికి

పాటపాడ్తున్నయ్. అటసూత్తె బీళ్లు, బీల్లల్ల బోర్లు, మొల్సి బత్తాయితోటలు బల్పుతోని ఇర్గకాసి ఎక్కిరిత్తున్నయ్ గని, వొర్రెల ఊటలు పార్తున్నయ్. వాగు చెలిమ కాడ పస్లకాడి పిల్లలు దూప దీర్సుకుంట నిలవడ్డ గుర్తు కానొత్తలేయి, ఒర్రె నెర్రెదెర్సిన మోరెత్తె. దుబ్బదుర్తి, దుశేరు, ఉత్తరేని, కామంచగంటలు, కంటిసుపులవులే. ఇగ పొక్లయిన్లు ఊర్లల్ల జొరబడి ఎగుడుదిగుడు మిర్రును సదును జేయ మడిగట్కొని ఉన్నయ్.

అటిటు చూస్తూ గూకోని గూకోని యాష్టకొచ్చి బ్యేగు బుజాన్కి ఏస్కొని కాలుకు పనిజెప్పి ఊర్లకాయి బాటవట్టిండు జానయ్య. డొంకరోడ్డు ఎల్పుసాగి బస్సురోడైంది. టాక్టర్లు ఈదులోంపు వాగుకు బాట పటినయ్, ఉష్క తోడ్కోని బస్తికాయ్‌కు బైలెల్తున్నయ్. వాగుల వొర్రెలు రాకాసి లెక్క నోరు దెర్సుకొని ఎవల్ని మింగాల్నా అన్నట్టు గున్నయ్. ఆడ నల్గురైద్గురు దనదనా పారతోని టెంకాలకెత్తి టాక్టరి సిట్కెల పిట్టుగ బర్తి జేస్తుండ్రు ఉష్కను.

జానయ్య నడ్సిండు "నేను ఇన్నొద్దులు పట్నం బోయి ఊరి పొలిమెరలో అడ్గుపెడ్తె దూరం నుంచి ఊర్నిజూస్తె ఊరు పట్నమోలె పిల్లిమొగ్గలేస్తుంది. ఊరు దరిదాపులకొస్తాల్కి ఊరు బోగం ముండలెక్క, పట్నం పడ్సు లెక్క, రంగులేస్కొని ఇంటినెత్తిన డిష్‌లు ఇంటింట్కి కేబుల్ తగిలించుకోనుంది. సూస్తాల్కి ఊల్యకుపోయి, ఇండ్లల్ల టీవీలలొల్లి, లొల్లికి పిల్లల్లు సప్పట్లు కొట్కుంట మొత్కుంటుండ్రు.

ఇంట్కాయి నడ్సుతుంటే సందులు, సందులుగనే ఉన్నయ్ వాడ. సందులు తిర్గితే చెన్నకేశవస్వామి గుడి ఊరి తూర్పుముఖాన మా ఇంటి పక్కంగనే, ముత్యాలమ్మ చెట్టు, ఆ గుడి దాటి చెట్టు ముంగల కొచ్చి నిల్వడ్డడు. ఎన్నాళ్లనుంచో తనకోసం ఎత్తుగ ఎద్గి ఎద్రుజూస్తున్నట్టు మొదలు, బారెడు పొడుగై పంగలు పర్సుకున్నయ్, చెట్టు మొదట్న చిన్న గుడి, అట్నె ఉంది. తన చిన్నప్పటి లెక్క నడ్మొంచి దేవున్కి దండం బెట్టి నీడన నిల్వడ్డడు.

నుల్కమంచంల కుస్కుకుస్కున దగ్గుకుంట ఒత్తులెండిన కండ్లతోని నొసట్కి చేతి బెట్టి సూపు ఆనక, దరికి రాని సూపుకు గాజుకళ్ల జోడు బెట్కోని, "ఎవడ్రా అది... లాగి గీగు లొటపీసు పటాటోప్రం గట్కోని లత్కోర్ సాబ్ లెక్క నిల్వడ్డవ్

ఎవల్గావాలే సారు ఏందీ?" వొన్కుతున్న గొంతోని నరాలు కూడ దీస్కోని బొక్కల ముంతైన ఒంటిని ఊత కఱ్ఱ ఆసరాతో లేవనికె అస్కులాడ్కుంట లేస్తుండు. సిద్దయ్య తాత! తాతను గుర్తుబట్టి పోలికలు, రూపు ఎత్తు పొడ్గు పోల్చుకొని

"నేను తాత నేను, జాంగాని, చిన్నప్పుడు జంగా... ఓరి జంగా.. అని పిల్సెటోడ్వి గుర్తుందా... నేను వల్లమ్మకొడ్కుని, అదేనేనో ఓ తాతా పెరుమాళ్ల నాగులు మా అయ్య, గుర్తున్నాడే... గుర్తుకొచ్చినాదీ జఱ్ఱయాది జేస్కో"..., "ఓష్ నువ్వార జంగా.. బాగున్నావ్, ఇన్నొద్దులు ఏమైపోయినవ్, నీ జాడలేకపాయె జవాబు లేక పాయే నీ అమ్మ ఏడేడ్నో దేవులాడి దేవులాడి అల్చిఅల్చి పుల్చిపోయింది. దాని పాణం నిన్ను తల్సని దినం లేదాయె, గాలి సప్పుడైతే కొడ్కొత్తుండని లేసి తల్పుదీసి సూసేది ఎఱ్ఱిబాగులది నీమీది ఎంత పావురమో, దాని పాణమంత నువ్వేరా...యాది జేస్కున్నప్పుడల్లా ఎడ్సిఎడ్సి గుండెలు అవిసిపోయేది పిచ్చిదిరా నీ అమ్మ" తాత జేప్తా ఉంటె కండ్ల నీళ్లు సుడులు తిర్గుతున్నయ్ జాననికి". "పదేండ్ల పోరగాన్వి మటాల్న మాయమైత్వి ఏమైనవ్‌రా..., ఇన్నొద్దులు యాడుంట్వి మన్వడా.. అగో మీ అమ్మ కర్వుపన్కి పోయింది గని ఇట్ల గూకో మన్వడా.., చెప్పు నీ జోలి జెప్పు సోరోన్వి అయినవ్, మంచి పషీమీద ఉన్నవ్ నిగనిగ వన్నెదేలి దొరోల్ల పోరని లెక్క ఉన్నవ్ గని అసలు నువ్ మా వల్లికొడ్కువేనా", "అదేంది తాత అట్టంటవ్, నేను ఆమె కొడ్కుగాకుంటే గీడ్కి ఎందుకొస్తా మావూరు, మావోళ్లు కాబట్టె, పోవాలే, పోవాలే అని ఎన్నిసార్లు మతి మల్లినా..., ఇన్నొద్దులకు తీర్వాటైంది. ఎంతాత గాశారం గాండ్ మారెతో కుదా క్యాకర్తా అన్నట్టు మన దెశగిట్టుంటె దాన్కి ఎవలేం జేస్తం తాత. నొష్టిన గీత మార్సెదెవడు. బెమ్మ నొష్టిన రాత రాస్తడట ఏమో ఎవన్కెర్క రాత ఏట్లుంటె గట్లయితదీ"

"ఏరో టక్కరోడ పట్నం మాట నెర్సినవ్, షాన్ వైనవ్‌రో"

"ఏహె ఊకో తాత నేనేం నెర్సిన గని"

"ఔరా... మేకనేం జేసినవ్ బర్లగాయిరా.. అంటె తోట్ల తోల్త్వి అయినా అంత మర్సెపోయింఢ్రు. ఆ సంగతి ఇన్నొద్దులు గుర్తుండాది గని"

"అదికాదు తాత ఇంట్ల అమ్మకు సుస్తాయె చేత్ల కాని పైసలేదాయే నాదేమో

బడిమాని బర్లకాడి జీతమాయె ఏంజెయ్యాల్నో తోచకపాయె తాత బర్ల గాస్కుంటున్న నా పక్కన గొల్లోని శేల బర్లుపడ్డయ్, ఇగగొల్లోడు బర్గందుకొని సప్పరిత్తడని బుగులు పట్కునె పర్గు తీస్న, ఎట్ల జేయాలే ఊల్లకు పోతే పెద్దమన్సుల్ల బెట్టి కొట్టిత్తరు, దండ్గలు గట్టిత్తరు, పాయె మాల్‌కు జడ్సి మొలకున్న ఎండిగొల్సు మొల్తదు, ఆరమాయే ఎంతకో అంత అంగట్ల అడ్డికి పావుశేరు లెక్క అమ్మి పట్నంలబడ్డ. ఇగ ఊరి మొకమెర్గనైతి..! అప్పుడప్పుడు రావల్ననిపించినా వొస్తె కొడ్తరనీ రాలే. నేన్ బోయి పదిపన్నెండేండ్లకు ఉతారై, అంతా పాతమర్సాయ్. అప్పటి కోపతాపం అపడ్డి అల్సానికి ఆగమైతి, ఇన్నొద్దులు ఊర్కి దూరమైతి, అమ్మకు తీరని సోకం మిగిలిస్తి, గిసొంటి కొడ్కు పుడ్తెందీ, గిడ్తెందీ, పుట్టంగ సచ్చినా బావుండు"

"ఏం జేస్తం మన్వడా అది కర్మ, ఎన్కజెన్మల ఏం జేస్నవో ఈ జెన్మల బర్ల వొంకన అమ్మను, ఉన్న ఊర్ని ఎడబాస్తివి, శని జాలక గట్లయిత్వి గని ఊకో... మన్వడా శివునికె తప్పదాయె శని పీడ... అది సరే పట్నంల ఏం జేస్తివి ఎంది"...

"ఆ ఏముంది తాతా.. పట్నంల పడ్డంక జేబ్ల పైసలొడ్సినయ్ ఏం జెయ్యాల్నా అని ఓ ఓటల్ల కుద్రిన. ఆడ పంజేస్కుంటనే ఓ లారి డైవర్‌తోని సోపతైంది. ఇగ గాయిన లారిమీదనే కుద్రిన. దాన్మిద క్లీనర్‌గ జేస్కుంట అయిన్కి తలలో నాల్కలెక్క నమ్మకంగుండి లారి నడ్పడం నేర్సుకున్న.. ఇగ గిప్పుడు లారీకి డ్రైవర్‌నైన గాయన పుణ్యాన!"

"అమ్మనా .. మన్వడా.. బర్ల పుణ్యాన డైవర్‌వైతే అయినవ్ బర్లు మేలే జేసినయ్ మన్వడా.. మంచి పనోనైవనవ్ అగొ గాడ నల్లబోస్తుంది గని కాసిన్ని నీల్దాగి సల్ల బుచ్కో నాకిన్ని పట్కరా.. మజ్జెనాన్కి మీ అమ్మ ఓస్తది గని పొద్దున ఎప్పుడెల్లినవో, ఎందిన్నవో అట ఊర్లకాయి పోరాదూ ఊర్ల ఎదంటే అది దొర్కుద్ది కడ్పు సల్లబుచ్చుకో ఎందన్న నోట్లేస్కొని" అనె తాత.

"సరెతాత అటు ఊర్లకాయి పొయ్యోస్త కొంటి పుల్లయ్య సేటు దుకునం గౌండ్ల అంజయ్య కల్లుకాణం ఉందా... తాత"

"ఇంకెక్కడి దుక్నాలు మన్వడా... కొంటి పుల్లయ్య పెట్టెబేడ సర్ది పట్నంల పడె, గౌండ్ల అంజిగాడు యవుసంలవడి ముస్తాదు పక్కన పెట్టిండు. మనూల్య

మోతబరి గాడేనాయె గిప్పుడు”

“మరి దుక్నం ఏడుంది తాత”

‘కాపోల్లు దుక్నాలు పెట్టింద్రు. ఒక్క కాపోల్లెకాదు సూదర్లు, మనోళ్లు సగ దుక్నాలు బెట్టిరి. సందుకో దుక్నం అయింది మన్వడా”

“ఏంది అట్లనా”

“ఔను మన్వడా.. సంపాదనకు మర్గపట్టింద్రు పతి బేరం ఆల్లదే, పతి దుక్నం ఆల్లదేనాయెూ కర్రె నర్సిరెడ్డి ఇంట్కిపో అండ్లనే అన్ని ఉంటయ్ నాకిన్ని పంట్కిందిక్నిత్తులు పట్కరా.. మందుమాకు వొల్లగాని... గదేందో గింత తంసపుతే మన్వడా... కర్రొల ఇల్లంటె చెప్తరు” అనె తాత.

“మరి ఊల్య కల్లు ఎవలు గిస్తుర్రు తాతా”...

“కొత్త గౌండ్లోడు గీస్తుండు గని”

“ఆడెవడే”

ఆన్ది అక్కడ ఉత్తరాజి, సుట్టాలొంకన వొచ్చి ఈ వూరి పిల్లన్ జేస్కొని ఈన్నె ఉంటుండు. ఈన్నె నాల్దాల్లు గీస్కొని బత్తుండు”

“అంతేనా... తాతా”

“ఔనోయ్..”

“ఊరుసగ పట్నం లెక్క అయిపాయె”

“ఔ.. తాత” మనోళ్లు అంత నిమ్మలమేనా

“బాగ బత్తుంద్రా..”

“ఆల్లకేంది మన్యడా... ఇగ్గో ఇట్టకన్పించే బంగులాలు మనోల్లయే అది పెద్దెంకడ్డి గిది నడిపోడు చింతల్ల మల్లిగాంది, అది చిన్నోడు చిట్కల నాదుడు పర్మేష్గాంది. గీ చింతల్ల ఒక్కలేనా ఏంది, గోరటోళ్లు, బత్తులోల్లు, అంతా లచ్చాదికార్లు అయింద్రు అసలు ఊరంతా లచ్చాదికార్లయింద్రు”.

“ఎట్టా ఎట్టెట్టా..”

“అవునోయ్ అదేదో రియలోలట్ట పట్నంల నుంచి ఊర్లల్ల వడ్డరు. ఎకురం పదేలు ఉన్న శెల్క ఒక్క పాలే లచ్చకు పెంచికూకుంద్రు. మాయదారి కాలం

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Iguram**

* * *